విశాఖపట్టణం
గురువారం 6 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:194 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# మళ్లకు ఈడీ ఉచ్చు

**నివాసాలు, ఆఫీసుల్లో సోదాలు**

**ఏకకాలంలో ప్రత్యేక బృందాల తనిఖీలు**

**రూ. 3వేల కోట్ల మేర అక్రమాలు**

**నమ్మకానికి అమ్మ వంటిది అంటూ టోకరా**




# ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం

**ప్రపంచ ఆవిష్కరణల గమ్యస్థానంగా భారత్**

**విశాఖలో ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్**

**ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా సెంటర్ ఏర్పాటు**

**విశాఖలో మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలు**

**ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్ సందర్శన**






(విశాఖపట్నం - జయజయహే)

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం విశాఖపట్నంలో తన నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా విశాఖ ఇసుకతోట జంక్షన్ లోని లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ గవర్నెన్స్ ఇంటిలిజెన్స్, కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ, ఫస్ట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ను ఏర్పాటుచేయడం జరిగింది. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా డ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ..మిగతా 2లో



# యాంకర్ ప్రాజెక్టుగా బే సిటీ

**ఎకనామిక్ రీజియన్‌కు మాస్టర్ ప్లాన్**

**రూ. 9.50 లక్షల కోట్లు పెట్టుబడుల లక్ష్యం**

**రూ. 4 లక్షల కోట్లు ప్రభుత్వం పెట్టుబడి**

**రూ. 5.30 లక్షల కోట్లు ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్**

**సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు**

(అమరావతి - జయజయహే)

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు ద్వారా వివిధ కీలక రంగాల్లో రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా బృహత్తర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇందులో భాగంగా రూ. 3.50 నుంచి 4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులతో పాటు, ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా పక్కా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. అమరావతిలో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'బేసిటీ'ని యాంకర్ ప్రాజెక్టుగా మలుచుకుని, సూక్ష్మ స్థాయి ప్రణాళికతో వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ రంగాలకు ప్రాధాన్యమిస్తూ మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు ఈ ..మిగతా 2లో



# దళారులదే రాజ్యం..!

**కూటమి పాలనలో రైతులకు దగా.. బ్రోకర్లకు లాభాలు.. రైతులకు నష్టాలు**

**గిట్టుబాటు ధర కల్పించాల్సిందే.. లేకుంటే పోరాటం ఉధృతం**

**వైఎస్ జగన్ హెచ్చరిక... దేవరపల్లిలో పొగాకు రైతులతో ముఖాముఖి**

(దేవరపల్లి - జయజయహే)

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం లోని పొగాకు కొనుగోలు కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటించారు. అక్కడ నిల్వ ఉంచిన పొగాకు బ్యారెల్లను నేరుగా పరిశీలించిన అనంతరం, పంటకు గిట్టుబాటు ధర రాక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పొగాకు రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి రైతులను కోలుకోలేని విధంగా దగా చేస్తుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో పొగాకు ధర రూ. 289 వరకు పలికిందని, కానీ నేడు కూటమి పాలనలో ధర ఏకంగా రూ. 236కి దిగజారిపోయిందని జగన్ గణాంకాలతో సహా వివరించారు. ఓవైపు ..మిగతా 3లో




# పెట్టుబడుల ప్రవాహం

**ఎఫ్‌డీఐలలో ఏపీ టాప్**

**లోక్ సభలో స్పష్టం చేసిన కేంద్రం**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ..మిగతా 2లో

అగ్రిగోల్డ్ ఆస్తులు వేలంకు

# గ్రీన్ సిగ్నల్

**ఆరు వేల ఎకరాల అమ్మకానికి సిద్ధం**

**ఈ నెలలోనే విధివిధానాలు ఖరారు**

**సెప్టెంబర్ 15 నాటికి బాండ్ల పంపిణీ**

**మంత్రివర్గ ఉప సంఘం కీలక నిర్ణయం**

(అమరావతి - జయజయహే)

అగ్రిగోల్డ్‌కు చెందిన 6,000 ఎకరాలకు పైగా భూములను వెంటనే వేలం వేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపై సమగ్రంగా చర్చించారు. భూముల వేలం ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని సీఐడీ, పోలీసు శాఖలను సబ్ కమిటీ ఆదేశించింది. ఆస్తుల వేలానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను ఈ నెల 11 నాటికి ఖరారు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బాధితుల కేసుల వేగవంతమైన ..మిగతా 2లో





# జగన్ కేసుల్లో 13 ఏళ్ల జాప్యం


**సాకులతో కాలయాపన.. సకాలంలో కేసులు తేలాలి**

**లేకుంటే న్యాయవ్యవస్థపై నమ్మకం పోతోంది**

**రాజ్యసభలో టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్ వ్యాఖ్యలు**

**సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సవరణ బిల్లు చర్చలో ప్రస్తావన**





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పార్లమెంట్, రాజ్యసభలో ప్రతిపాదించిన 'సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు - 2026'కు తెలుగుదేశం పార్టీ తరఫున ఎంపీ చింతకాయల విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయ-ంమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈ-కోర్టులు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను ఎంపీ విజయ్ సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవడమంటే న్యాయం నిరాకరించినట్లేనని ఎంపీ విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభ సాక్షిగా ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సీబీఐ, ఈడీ కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగలేదని ప్రశ్నించారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ..మిగతా 2లో

# డిసెంబర్‌లో మరో డీఎస్సీ

**సంకేతం ఇచ్చిన మంత్రి లోకేశ్**

(అమరావతి - జయజయహే)


రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని భావించే లక్షలాది మంది నిరుద్యోగ యువత ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న కబురు రానే వచ్చింది. డీఎస్సీకి సంబంధించిన వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. టెట్ ప్రారంభం రోజునే అభ్యర్థులకు ఆల్‌ది బెస్ట్ చెబుతూ డీఎస్సీకి రాబోతోందని స్పష్టం చేశారు. ఎన్ని పోస్టులు అనేది చెప్పకపోయినా నోటిఫికేషన్ ఎప్పుడు, పరీక్ష ఏ నెలలో పెడతారనే విషయంపై క్లారిటీ ఇచ్చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హ పరీక్ష టెట్ ప్రారంభమైంది. ప్రభుత్వం పాఠశాలల్లో టీచర్ పోస్టు ..మిగతా 2లో



# ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.



**ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం**

భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కేంద్రాల్లో ఆవిష్కరణలు, సేవల సామర్థ్యాలను విస్తరించాలన్న ఐబీఎం లక్ష్యానికి ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రతీకగా నిలుస్తోంది. విస్తృత సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం ప్రపంచ ఖాతాదారుల అవసరాలను తీర్చేందుకు అనువైన కేంద్రంగా ఎదుగుతోంది. ఈ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఐబీఎం తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటునందిస్తోంది. మా లక్ష్యం, కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు, నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను మేం స్వాగతిస్తున్నాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికిఎదురుచూస్తున్నామని అన్నారు.

**ప్రపంచ ఆవిష్కరణల గమ్యస్థానంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం**

ఈ సందర్భంగా ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ మాట్లాడుతూ... వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భారతదేశానికి డిజిటల్ యుగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే అపూర్వ అవకాశం ఉంది. ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేసుకుంటూ ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఐబీఎంలో మేం, మా ఖాతాదారులు ఏఐతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకుని, దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాం. విశాఖపట్నంలోని ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఏర్పాటు ఇందుకు నిదర్శనం. అలాగే ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక సేవల కేంద్రంగా భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

**యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాం**

ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ ఉషా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వల్ల ప్రపంచ ఖాతాదారుల డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవసరాలకు మద్దతు ఇచ్చే కీలక కేంద్రంగా మారుతోంది. ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను స్థానిక ప్రతిభతో సమన్వయం చేస్తాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అంతకుముందు ఐబీఎం సిబ్బందితో మంత్రి మాట్లాడారు. అందరూ గర్వపడే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐబీఎంకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# మళ్లకు ఈడీ ఉచ్చు

## నివాసాలు, ఆఫీసుల్లో సోదాలు
## ఏకకాలంలో ప్రత్యేక బృందాల తనిఖీలు
## రూ. 3వేల కోట్ల మేర అక్రమాలు
## నమ్మకానికి అమ్మ వంటిది అంటూ టోకరా

**(విశాఖపట్నం - జయజయహే)**

విశాఖ వైఎస్సార్సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఈడీ దాడులతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఆయన ఇళ్లు, కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ తనిఖీలు చేపట్టింది. వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీల ఛైర్మన్‌గా అవకతవకలకు పాల్పడిన కేసులో సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. విశాఖపట్నం, హైదరాబాద్‌లోని ఆయన నివాసాలు, కార్యాలయాల్లో ఐదు చోట్ల ఏకకాలంలో ఈడీ దాడి చేసింది. బుధవారం ఉదయం నుంచి బిహార్‌కు చెందిన ఈడీ బృందం విశాఖలోని విజయప్రసాద్ ఇంట్లో సోదాలు జరుపుతోంది. వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీల ఛైర్మన్‌గా వ్యవహరించిన ఆయన, అనేక అవకతవకలకు పాల్పడిన కేసులో ఈడీ దాడులు జరుగుతున్నాయి. దాదాపు రూ.3,000 కోట్ల అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో భాగంగా విజయ్ ప్రసాద్ బ్యాంక్ ఖాతాలు, ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ సాక్ష్యాలు, కీలక పత్రాలను ఈడీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. గతంలోనూ విజయ్ ప్రసాద్ ఇళ్లు, కార్యాలయాలపై సోదాలు జరిగిన విషయం తెలిసిందే. 2009లో విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా విజయ్ ప్రసాద్ గెలుపొందారు. 2019 శాసనసభ ఎన్నికల్లో విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2021లో ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం వెస్ట్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వేళ ఈడీ సోదాలు జరగడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది.

## అగ్రిగోల్డ్ ఆస్తులు వేలంకు
# గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి...

విచారణ కోసం ఆగస్టు 15 లోగా ప్రత్యేక కోర్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. 9 రాష్ట్రాల్లోని డిపాజిటర్లకు బాండ్లు అందించేందుకు ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక సెల్స్, డిపాజిటర్ల సమాచారం కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. సెప్టెంబర్ 15 నాటికి బాండ్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని, సీఎం చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు విడతల వారీగా చెల్లింపులు జరపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భూములను చిన్న బిట్లుగా విక్రయిస్తే : ఈ ప్రక్రియపై ఈ నెల 11న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో మరో కీలక సమీక్ష సమావేశం జరగనుంది. ప్రభుత్వం భూముల వేలానికి శ్రీకారం చుట్టడంపై బాధితుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ భూములను చిన్న బిట్లుగా విక్రయిస్తే బాధితులకు త్వరితగతిన పరిహారం అందుతుందని ముప్పాళ్ల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. సమావేశంలో అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల ప్రవాహం

మొదటి పేజీ తరువాయి...

రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 - 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 - 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్‌అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జగన్ కేసుల్లో 13 ఏళ్ల జాప్యం

మొదటి పేజీ తరువాయి...

ఆయన ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఎంపీ విజయ్ కుండబద్దలు కొట్టారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపీ విజయ్ తెలిపారు. ఈ వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కిందిస్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సీబీఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపీ చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు.



# గిరిజనులకు సంజీవని

## అల్లూరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు
## 22న సీఎం చంద్రబాబు శ్రీకారం.. అధికారుల విస్తృత ఏర్పాట్లు

**(అమరావతి - జయజయహే)**

అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 22వ తేదీన ఈ జిల్లాలో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన సంజీవని పైలట్ ప్రాజెక్ట్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. సీఎం రాక సందర్భంగా చేపట్టాల్సిన వివిధ రకాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదిత్య వర్మ, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రుతి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావుతో పాటు వివిధ శాఖలకు చెందిన పలువురు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి నిర్వహించే సభలు, ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎం పర్యటనకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారి కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్కులు, పబ్లిక్ రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండ తీవ్రత లేదా ఆరోగ్య అత్యవసర పరిస్థితులను తట్టుకోవడానికి వీలుగా సభా ప్రాంగణం వద్ద తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలు (మెడికల్ క్యాంపులు) అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం వైపు నుంచి భద్రత, ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. వీఐపీ సెక్యూరిటీ, హెలిప్యాడ్ నిర్మాణం, సీఎం కాన్వాయ్ ప్రయాణించే మార్గాలు, సభా ప్రాంగణం వద్ద ప్రజల గ్యాలరీల నిర్వహణ, పబ్లిక్ ఎంట్రీల పర్యవేక్షణ వంటి ఏర్పాట్లను లోప రహితంగా సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



# ఆర్థిక నిధులతో కొళాయి రిపేరు

**అరకులోయ: ఆగస్టు 05,జయ జయహే**

అరకు వేలి మండలం చిన్నలబుడు గ్రామంలో పంచాయతీ ఆర్థిక నిధులతో నూతనంగా కొళాయి కనెక్షన్ రిపేరు చేసి కొల్లాయి నీలను అందేలా చర్యలు చేపట్టారని దీనిపై ప్రారంభించారని స్థానిక ప్రజలు సంతోష వ్యక్తం చేశారని పంచాయితీ టిడిపి పార్టీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ తెలిపారు, కొళాయి పైపు కనెక్షన్ లేకపోవడంతో మంచినీళ్లకు తీవ్ర ఇబ్బంది పడుతుండేవారని పైపులు రిపేర్ చేసి వీధి వీధికి కొళాయి కనెక్షన్ చరపర చర్యలు చేపట్టారని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో తీ డొంబ్రు మాజీ వార్డు మెంబర్, జి అర్జున్, తీ గున్ మొత్తి, జీ బిబి సన్, జి రఘు, జి మధుధన్, అనంతరం చిన్నలబుడు సచివాలయ సిబ్బంది టిడిపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు,

# యాంకర్ ప్రాజెక్టుగా బే సీటీ

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధి విస్తరించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల అనుసంధానం, నిధుల కన్వర్జెన్స్ ద్వారా ప్రగతి సాధించాలని, అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీమ్‌ను అమలు చేయాలని ఆదేశించారు.అవసరమైతే వీజీఎఫ్ స్కీమ్ వర్తింపు: విశాఖను ఇప్పటికే అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వచ్చాయని అధికారులు ఈ సమావేశంలో వివరించారు. వీఈఆర్ పరిధిలోని 6 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం చేసి, స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా స్కిల్స్ అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత నిబంధనలకు అనుగుణంగా కోస్టల్ మేనేజ్మెంట్ ప్లాన్స్ రూపొందిస్తూనే పర్యాటక, పారిశ్రామిక ఎకో సిస్టమ్‌ను బలోపేతం చేయాలని సూచించారు. నిధుల కొరత లేకుండా కన్వర్జెన్స్ పద్ధతితో పాటు పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టులకు అవసరమైతే వీజీఎఫ్ స్కీమ్‌ను వర్తింపజేయాలని దిశానిర్దేశం చేశారు. జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న ఈస్ట్-వెస్ట్ కనెక్టివిటీ ఆధారంగా విశాఖ ప్రాజెక్టుల రూపకల్పన వేగవంతం కావాలని సీఎం చంద్రబాబు తెలిపారు. తూర్పు తీరంలో ఉన్న కాకినాడ, విశాఖ పోర్టులను పశ్చిమ భారత్‌లోని కీలక ప్రాంతాలతో రోడ్డు, రైలు మార్గాల ద్వారా అనుసంధానించాలని ఆదేశించారు. వీఈఆర్ పరిధిలోని 4 విమానాశ్రయాలు, 3 ప్రధాన రేవులను అనుసంధానించడం ద్వారా భారీగా పెట్టుబడులతో పాటు రవాణా రరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని వివరించారు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (+జజ), ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ రంగాలు ఒకదానితో ఒకటి ఇంటిగ్రేట్ అయ్యేలా కార్యాచరణ ఉండాలని అధికారులను కోరారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా విశాఖలోని జంతు ప్రదర్శన శాలను అంతర్జాతీయ ప్రమాణాలతో మరింత అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఆర్థిక రాజధానిగా విశాఖ: వీఈఆర్ ప్రాజెక్టు ద్వారా లభించే ప్రయోజనాలు, ఉద్యోగ-ఉపాధి అవకాశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక ప్రజలకు స్పష్టంగా వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతూ విశాఖ రీజియన్‌ను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. సీఆర్జెడ్ నిబంధనలు దాటకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక, విద్య , వైద్య శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# డిసెంబర్‌లో మరో డీఎస్సీ

మొదటి పేజీ తరువాయి...

సాధించాలనే లక్ష్యానికి ఇదో మెట్టు. ఈ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. వివిధ కేంద్రాల్లో డిజిటల్ పద్ధతిలో జరుగుతున్నాయి ఈ కీలక ఘట్టం ప్రారంభమైన తరుణంలో పరీక్షలు హాజరయ్యే అభ్యర్థులకు ధైర్యం చెబుతూనే భవిష్యత్ నియామక ప్రక్రియ గురించి తెలియజేశారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి, మానసిక ఆందోళనలకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కావాలనే యువత కలలను నెరవేర్చే దిశా ఈ టెట్ ఒక చారిత్రాత్మక మలుపు అని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌పై నమ్మకంతో ప్రతికూల ఆలోచనలకు తావులేకుండా పరీక్షా హాల్‌లోకి అడుగు పెట్టాలని సూచించారు. గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు భరోసా ఇచ్చారు.

**నిఘా నీడలో టెట్**

పరీక్షల నిర్వహణలో విశ్వసనీయతను పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ అత్యాధునిక సాంకేతికతను వాడుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు కఠిన తరం చేశారు. ప్రతి అభ్యర్థిని బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరీక్ష కేంద్రాలకు అమరావతిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. ప్రతి నిమిషం అక్కడ జరిగే పరిణామాలను లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా అధికారులు పర్యవేక్షించారు. సెంటర్లకు చేరుకోవడానికి రవాణా శాఖ ప్రత్యేక బస్సు సౌకర్యాలను కల్పించడంతోపాటు, సందేహాల నివృత్తికి జిల్లాల వారీగా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

# దళారులదే రాజ్యం..!





**మొదటి పేజీ తరువాయి...**

ఎరువులు, కూలీల ఖర్చు పెరిగి పెట్టుబడులు భారమవుతుంటే, మరోవైపు దిగుబడికి వచ్చే రాబడి దారుణంగా తగ్గిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 12 శాతం పొగాకు పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన 88 శాతం పంటను వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసి దళారులతో రాజీ పడిందని మండిపడ్డారు. తమ పాలనా కాలంలో రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలను సమర్థవంతంగా అందించామని, కానీ నేడు ఆ సదుపాయాలు పూర్తిగా నిలిచిపోయాయని జగన్ గుర్తుచేశారు. ఎన్నికల ముందు పీఎం కిసాన్ పథకానికి అదనంగా ప్రతి రైతుకూ రూ. 20 వేలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు.. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని నీరుగార్చడమే కాకుండా, తమ ప్రభుత్వంలో అమలైన ఉచిత పంటల బీమా పథకాన్ని కూడా రద్దు చేసి రైతుల పొట్ట కొట్టారు" అని దుయ్యబట్టారు. గిట్టుబాటు ధర లేక దిగుబడి అమ్ముకోలేక వెంకటేశ్వరరావు అనే పొగాకు రైతు ఆత్మహత్య చేసుకుంటే, ఆ కుటుంబాన్ని పరామర్శించే కనీస మానవత్వం కూడా ప్రభుత్వ పెద్దల్లో లేకపోవడం శోచనీయమన్నారు. తెలుగుదేశం పాలనలో వ్యవసాయంతో పాటు విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలు పూర్తిగా విధ్వంసమయ్యాయని మాజీ సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులు రోడ్డున పడి ఆక్రోశిస్తున్నా సీఎం చంద్రబాబుకు ఆత్మహత్యలు కనిపించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, రైతులపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ మొదటి నుంచీ ప్రజలను, రైతులను వెన్నుపోటు పొడిచే రాజకీయాన్నే నమ్ముకుందని ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, రైతులకు రావాల్సిన ప్రతి పైసా గిట్టుబాటు ధర లభించే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని జగన్ స్పష్టం చేశారు. నష్టపోయిన ప్రతి పొగాకు రైతుకూ తక్షణమే ప్రభుత్వం మద్దతు ధర కల్పించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటేశ్వరరావు కుటుంబాన్ని రూ. 10 లక్షల నష్టపరిహారంతో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము విశ్రమించేది లేదని భరోసా ఇచ్చారు.



## పట్టణ అభివృద్ధిపై జీవీఎంసీ అధికారులతో చర్చిస్తున్న కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

మాజీ మంత్రివర్యులు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అనకాపల్లి పట్టణ జీవీఎంసీ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది . పట్టణ అభివృద్ధి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పన కొనసాగుతున్న అభివృద్ధి పనులు పురోగతి చరిత్ర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని తక్షణం పరిష్కరించవలసిన సమస్యలను సత్వరము పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే రామకృష్ణ అధికారులకు సూచించారు అలాగే అభివృద్ధి పనుల్లో నాణ్యతగా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ చక్రవర్తి డిఇ.ఈతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు

## అసంపూర్తి అంగన్వాడి భవనాలు నిర్మాణానికి కోటి మంజూరు

**మాడుగుల, ఆగస్టు 5 జయ జయహే**



అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి కేంద్రాలు పూర్తి చేసేందుకు సిఎస్ఆర్ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ కార్యాలయం బుధవారం తెలిపింది. ఎమ్మెల్యే కృషి చొరవ మూలంగా మాడుగుల నియోజవర్గంతో పాటు సుమారు 18 భవనాలకు కోటి లక్ష యాభై శుభ్రంగా వేల రూపాయలు మంజూరైనట్టు పేర్కొన్నారు. వీటిలో మాడుగుల మండలం కాగిత, తిరువాడ, కామకోటం గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాలు నిర్మాణానికి 9 లక్షల రూపాయలు చొప్పున మంజురవ గా శ్రీరాంపురంలో భవనానికి రెండున్నర లక్ష రూపాయలు మంజూరయ్యాయి. కొండెంపూడి లో భవనం నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఇక పొడవు నియోజకవర్గ పరిధిలో గల రోలుగొండ మండలంలో వడ్డీ ప భవనానికి ఆరున్నర లక్షలు, జే నాయుడుపాలెం వన్ కేంద్రానికి ఐదు లక్షలు, జే నాయుడుపాలెం టు కేంద్రానికి ఆరున్నర లక్షలు, కొండపాలెం భవనానికి 5 లక్షలు దెబ్బపాలెం భవనానికి ఐదు లక్షలు, డోలవానిపాలెం భవనానికి ఐదు లక్షలు మంజూరయ్యాయి. అలాగే రావికమతం మండలం టి అజ్జాపురం భవనానికి మూడు లక్షలు, కే ధర్మవరం భవనానికి ఐదు లక్షలు, దొండపూడి=2 భవనానికి ఐదు లక్షలు మంజురవ గా, గొలిగొండ మండలం చోద్యం భవనానికి రెండున్నర లక్షలు, సిహెచ్ నాగపురం భవనానికి 5 లక్షలు, గుండు పాలెం మౌనానికి 8.50 లక్షలు, కొంగ సింగ్ భవనానికి ఐదు లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో మొదటి విడతగా 50 లక్షల 75 వేల రూపాయలు విడుదల చేసినట్టు పేర్కొన్నారు

## పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

**విశాఖపట్నం, ఆగష్టు 5, జయ జయహే**

విశాఖ అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు తలపెట్టిన సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్ నిర్మాణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం భూమిపూజ చేశారు. తోటగరువులోని అకాడమీ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు పీవీ సింధు, ఇతర కుటుంబ సభ్యులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పీవీ సింధు, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అకాడమీ భవన నమూనాతో పాటు క్రీడాకారులకు అందుబాటులోకి రానున్న అత్యాధునిక సౌకర్యాలు, వసతుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అకాడమీపై రూపొందించిన ఏవీని వీక్షించారు. అందరితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ





కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండీ ఎస్.భరణి, గ్రీన్ కో ఎనర్జీ ఎఫీషియన్సీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతి తదితరులు పాల్గొన్నారు

## శ్రీ నూకంబిక అమ్మవారి దర్శించుకున్న సినీ నటుడు సోను సూద్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**జయ జయహే**

స్థానిక గ గవరపాలెం వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ నోకాంబిక అమ్మవారిని బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సినీ యాక్టర్ సోను సూద్ అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది వీరికి ఆలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా మేళ తాళాలతో వేద పండితులు వేదమంత్రోచరణల మధ్య స్వాగతం పలకడం జరిగింది వీరికి దేవాలయం దర్శనం అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదములు ఇచ్చి ఆలయ చైర్మన్ పి నాగ శ్రీను (గొల్ల బాబు ) దుస్సాలువాతో ఘనంగా సత్కరిం చి సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధారాణి ఎగ్జిక్యూటివ్




ఆఫీసర్ వై శ్రీధర్ ధర్మకర్తలు సూర్య సతీష్ దాడి రవి పొలిమేర ఆనంద్ మారిశెట్టి శంకర్రావు కొడుకుల శ్రీకాంత్ మజ్జి శ్రీను ఎర్రవరపు సంతోష్ కుమారి ఆలయ ప్రధాన



అర్చకులు అధికారులు కూటమి నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



## న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదా రూపకల్పనకు గ్రీన్ సిగ్నల్

### న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం- మంత్రి ఫరూక్ స్పష్టీకరణ

**అమరావతి, ఆగస్టు05 (జయ జయహే )**

ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026( ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్ -2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ చర్యలకు ఉపక్రమించింది. ముసాయిదాను వీలైనంత త్వరగా తయారు చేయాలని న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం తో యుద్ధ ప్రాతిపదికన చర్చించి ముసాయిదా రూపకల్పనకు కార్యాచరణ చేపట్టాలని న్యాయశాఖ కార్యదర్శి కి సూచన చేసినట్లు మంత్రి ఫరూక్ బుధవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ముసాయిదా బిల్లు తయారైన వెంటనే తదుపరి చర్యల కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తో పాటు ఆర్థిక శాఖ రిమార్కులను పరిగణలోకి తీసుకొని బిల్లు ఆమోదం కోసం మంత్రి మండలి సమావేశం ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని మంత్రి తెలిపారు.న్యాయవాదుల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ప్రకారం మొత్తం రూ. 46.92 కోట్లు ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన కేజీహెచ్ అభివృద్ధి మండలి సభ్యులు

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ నగరానికి విచ్చేసిన టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు , రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను విశాఖ జనసేన పార్టీ నాయకులు, కేజీహెచ్ అభివృద్ధి మండలి సభ్యులు డా. మర్రివేముల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉన్నత విద్య ప్రమాణాలు పెంచడంలో ఉద్యోగావకాశలు పెంచడంలో మంత్రి లోకేష్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు, పేద ప్రజలకు మరింత ప్రాధాన్యత కల్పించాలని కోరారు.





## పొగాకు రైతులకు ధైర్యం చెప్పిన మాజీ సీఎం జగన్

### పొగాకు రైతుల సమస్యలపై రాజీ లేని పోరాటం

**దేవర పల్లి -(తూర్పుగోదావరి జిల్లా )జయ జయహే**

రాష్ట్రం లో ప్రధాన వాణిజ్య పంట, విదేశీ మారక ద్రవ్యం తెచ్చే వర్జీనియా పొగాకు కుగిట్టుబాటు ధర ఇవ్వాలని కోరుతూ వై ఎస్ ఆర్ సిపి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సి ఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లాఛలో దేవరపల్లి కార్యక్రమం సక్సెస్ అయ్యిందని వై సిపి నాయకులు సంతోషం వ్యక్తం చేసారు.ఏలూరు జిల్లా చింతలపూడినియోజకవర్గం వైసీపీ కన్వీనర్ కంభం విజయ రాజు,పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాల రాజు, మచిలీపట్నం పరి శీలకుడు సీనియర్ నేత జెట్టి గురునాధరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగావారు మీడియా తో మాట్లాడుతూ పోలవరం, చింతలపూడి నియోజకర్గాల నుంచి పెద్ద సంఖ్యలో పొగాకు రైతులు, వైఎస్ ఆర్ సిపి శ్రేణులు ఉదయం జంగారెడ్డిగూడెం దండ మూడి కళ్యాణమండపం నుండి బయలుదేరి వెళ్ళి నట్టు పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి పిలుపు అందుకుని భారీ స్థాయి లో దేవర పల్లి వేలంకేంద్రం వద్దకు వచ్చారనిపొగాకు రైతులకు సరైన ధర ఇవ్వాలని తాను వస్తునట్టు తెలీటం తో ఇరవై రూపాయలు ధర పెంచారని జగన్ పేర్కొన్నారన్నారు. గతం లో తాము సరాసరి ధర పెంచి లక్ష రూపాయలు వడ్డీ లేని ఋణం రైతులకు ఇచ్చినట్టు గుర్తు జేశారని పేర్కొన్నారు. కొనుగోలు దార్లు కుమ్మక్కు అయ్యితే ప్రభుత్వం పొగాకు కొని రైతులకు న్యాయంచేయాలని జగన్ డిమాండ్ చేశారని వారు పేర్కొన్నారు. తమ పిలుపు మేరకు కార్యక్రమం విజయవంతం చేశారని వారు కృతజ్ఞతలు తెలిపారు.

## తండ్రితనం- తల్లడిల్లె గుణం

**ఒక పురుషుని మానసిక పరిణామ గాథ**

ఒంటరి... తుంటరితనమే బాల్యం.
వికారాలే కనిపించే,
మమకారాలు మొలకెత్తని కాలం ---
యవ్వనం.
దేహాభిమానం...దర్జాతనం...
తిని, తిరిగి, తేరకారంగా గడపడమే
ప్రధాన కర్తవ్యంగా భావించే వయసు.
కళ్లుండీ...
భవిష్యత్తును దర్శించలేని
అంధకార ప్రయాణమే నేటి యువతలో
చాలామందిది.

అది ఒకనాటి కథ...!
కూలీ అయినా... కుతుబ్ షా అయి-
ూనా...
పామరుడైనా... పాదుషా అయినా...
ఒంటరి జీవితం
ఒకనాడు జంట జీవితంగా
మారుతుంది.

ప్రేమో...
ఆచారమో...
సహజ జీవన ధర్మమో...

ఒక తనువు మరో తనువుకు
తోడవుతుంది.
ఆ క్షణమే...
“భర్త” అనే బాధ్యతతో పాటు,
“తండ్రి” అనే మహోన్నత నామం
జీవితానికి పదోన్నతిగా లభిస్తుంది.
అదే క్షణం నుంచి
బాధ్యతల బరువు
మెడపై కనిపించని హారంలా
వేలాడుతుంది.
తల్లడిల్లే మనసుకు ఆరంభమవుతుంది.
తన భవిష్యత్తుకంటే,
తన పిల్లల భవిష్యత్తే
అతని ప్రతి ఆలోచనగా మారుతుంది.
దేహబాధలు మరచిపోతాడు.
దాహబాధలను దాచిపెడతాడు.
కొన్నిసార్లు కన్నీళ్లనే తాగి
దాహాన్ని తీర్చుకుంటాడు.
ఎవరూ వినలేని ఏడుపుతో,
ఎవరూ చూడలేని బాధతో,
మౌనంగా విలపిస్తుంటాడు.
అప్పుడు గుర్తుకొస్తుంది...
యవ్వనంలోని ఆ తేరకారతనం
ఎంత ప్రమాదకరమో!
గడిచిపోయిన కాలం తిరిగి రాదని,
చేసిన తప్పులు చెరగవని,
బాధ్యతలే నిజమైన గురువులని
అప్పుడే గ్రహిస్తాడు.

అయినా...
తండ్రితనం
తలవంచని ధైర్యం.
కష్టాలు శాశ్వతం కావని నమ్మకం.
తనయుల విద్యే
వారి తలరాతను మార్చగలదనే
విశ్వాసం.
తన ఆకలి కన్నా
వారి ఆకలికే విలువ ఇస్తాడు.
తన కలలు వాడిపోతున్నా,
వారి కలలు వికసించాలని
కోరుకుంటాడు.
తన ఆశలు నెరవేరకపోయినా,
వారి ఆశలు ఆకాశాన్నంటాలని
ప్రార్థిస్తాడు.

కొన్నిసార్లు...
తనయులే తన హృదయాన్ని
గాయపరుస్తారు.
అయినా...
వారి కోసం తల నిమిరే చేయి ఆగదు.
వారి కోసం దీవించే పెదవులు
మూగబోవు.
వారి కోసం త్యాగం చేసే మనసు
మారదు.
అనుదిన ఆకలిని
తన చెమటతో తీర్చుకొనే
మహానుభావుడు --- తండ్రి.
తన జీవితాన్ని త్యాగంగా మార్చి,
తన పిల్లల జీవితాన్ని విజయంగా
మలిచే మహాయోగి --- తండ్రి.

తండ్రి ఒక వ్యక్తి కాదు...

ఒక భారం.
ఒక బాధ్యత.
ఒక త్యాగం.
ఒక మౌన యుద్ధం.

ఒక అనివార్య...అజరామరం
జీవనం...ఆ తల్లడిల్లె హృదయం.



డా. జి. రాజేశ్వర రావు
ఫ్యాకల్టీ అఫ్ సైకాలజీ
ఆంధ్ర యూనివర్సిటీ

# బాల్యంలోకి చొరబడుతున్న హింస, అసభ్యత

(సి.హెచ్.ప్రతాప్)

**సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని మన అరచేతిలోకి తీసుకొచ్చింది. ఒకప్పుడు టెలివిజన్‌కు మాత్రమే పరిమితమైన వినోదం నేడు స్మార్ట్‌ఫోన్లు, ఓటీటీ వేదికలు, యూట్యూబ్, వీడియో గేమ్స్, సామాజిక మాధ్యమాల రూపంలో ప్రతి ఇంటికీ, ప్రతి పిల్లవాడి చేతికీ చేరింది. సమాచార విస్తరణ, విజ్ఞాన సాధనకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, వయస్సుకు అనుగుణం కాని హింసాత్మక దృశ్యాలు, అసభ్య పదజాలం, లైంగిక చిత్రీకరణ విచ్చలవిడిగా పిల్లలకు అందుబాటులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వినోదం పేరుతో ప్రసారమవుతున్న ఈ కంటెంట్ పిల్లల మానసిక వికాసం, భావోద్వేగ పరిపక్వత, సామాజిక ప్రవర్తనపై కనిపించని దాడిగా మారుతోంది.**



ప్రపంచ ఆరోగ్య సంస్థ , యునిసెఫ్, అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు చిన్నారులపై హింసాత్మక, లైంగిక కంటెంట్ ప్రభావం గురించి పలుమార్లు హెచ్చరించాయి. పలు దేశాలు వయస్సు ఆధారిత కంటెంట్ వర్గీకరణను మరింత కఠినతరం చేయడం, పిల్లల డిజిటల్ భద్రత కోసం ప్రత్యేక చట్టాలను అమలు చేయడం కూడా సమస్య తీవ్రతకు నిదర్శనం. అయితే సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరిస్తున్న కొద్దీ నియంత్రణ వ్యవస్థలు అదే స్థాయిలో ముందుకు సాగలేకపోతున్నాయి.

హింసాత్మక దృశ్యాలను పదేపదే వీక్షించే పిల్లల్లో హింస పట్ల సహజత్వ భావన పెరిగే ప్రమాదం ఉంది. వివాదాలను చర్చల ద్వారా కాకుండా బలప్రయోగంతో పరిష్కరించవచ్చనే అపోహ ఏర్పడుతుంది. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, వీడియో గేమ్స్‌లో కనిపించే దాడులు, ప్రమాదకర సాహసాలను అనుకరించే ప్రయత్నాలు కూడా పెరుగుతున్నాయి. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, వరుసగా హింసను వీక్షించే పిల్లల్లో ఇతరుల బాధల పట్ల సంవేదనశీలత క్రమంగా తగ్గిపోతుంది. భయానక దృశ్యాలు కొందరిలో పీడకలలు, నిద్రలేమి, ఆందోళన, ఒత్తిడి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలకు దారితీస్తే, మరికొందరిలో దూకుడు, అసహనం, కోపం, దాడి చేసే స్వభావాన్ని పెంచుతాయి.

లైంగిక చిత్రీకరణ ప్రభావం ఇంకా సంక్లిష్టమైనది. సరైన అవగాహన ఏర్పడకముందే ఇలాంటి కంటెంట్‌కు గురికావడం వల్ల పిల్లల్లో లైంగికతపై తప్పుడు అభిప్రాయాలు ఏర్పడే ప్రమాదం ఉంది. మహిళలు, పురుషులను వ్యక్తులుగా కాకుండా వస్తువులుగా చూసే ధోరణి పెరగడం, వయస్సుకు మించిన ప్రవర్తన, శరీరాకృతిపై అనవసర ఆందోళన, సంబంధాల పట్ల వాస్తవానికి విరుద్ధమైన అంచనాలు ఏర్పడటం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. కొందరు అపరాధ భావన, ఆత్మన్యూనత, ఒంటరితనం, డిప్రెషన్‌కు కూడా గురవుతున్నారు. బాల్యంలో ఇలాంటి మానసిక గాయాలు భవిష్యత్తులో ఆరోగ్యకరమైన వ్యక్తిగత, సామాజిక సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ ప్రభావాలు మానసిక ఆరోగ్యానికే పరిమితం కావు. చదువుపై ఏకాగ్రత తగ్గడం, విద్యా ఫలితాలు క్షీణించడం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల అసహనం పెరగడం, అసభ్య పదజాలాన్ని అనుకరించడం, కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోవడం, ఇంటర్నెట్‌కు బానిసలుగా మారడం వంటి పరిణామాలు క్రమంగా కనిపిస్తున్నాయి. పిల్లల వ్యక్తిత్వ వికాసానికి పునాదిగా ఉండాల్సిన కుటుంబ అనుబంధాలు, పుస్తక పఠనం, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల స్థానాన్ని డిజిటల్ తెరలు ఆక్రమిస్తున్నాయి. దీని ప్రభావం వారి విలువలపై, సామాజిక బాధ్యతపై కూడా పడుతోంది.

ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో అధిక వీక్షణల కోసం సంచలనాత్మక కంటెంట్‌ను ప్రోత్సహించే ధోరణి ఒకటి. ఓటీటీ వేదికలు, యూట్యూబ్ ఛానెల్లు, సామాజిక మాధ్యమాలు వీక్షకులను ఆకర్షించేందుకు హింస, లైంగికతను ప్రధాన అంశాలుగా ఉపయోగిస్తున్నాయి. వయస్సు ధృవీకరణ వ్యవస్థల్లో ఉన్న లోపాలు, తల్లిదండ్రుల పర్యవేక్షణ తగ్గడం, పిల్లలకు వ్యక్తిగత మొబైల్ పరికరాలు అందుబాటులో ఉండటం సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అల్గోరిథమ్‌లు ఒకసారి ఇలాంటి కంటెంట్‌ను చూసిన వారికి మరింత తీవ్ర కంటెంట్‌ను సూచించడం కూడా ప్రమాదాన్ని పెంచుతోంది.

ఈ సమస్యకు పరిష్కారం కేవలం చట్టాలతో సాధ్యం కాదు. తల్లిదండ్రులు పిల్లల స్క్రీన్ సమయాన్ని నియంత్రించడంతో పాటు, వారు వీక్షిస్తున్న కంటెంట్‌పై అవగాహన కలిగి ఉండాలి. పేరెంటల్ కంట్రోల్ వ్యవస్థలను వినియోగించడం, పిల్లలతో స్వేచ్ఛగా సంభాషించడం అవసరం. పాఠశాలలు డిజిటల్ లిటరసీ, విలువల విద్య, మానసిక ఆరోగ్యం, బాధ్యతాయుతమైన ఇంటర్నెట్ వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వం వయస్సు ఆధారిత కంటెంట్ వర్గీకరణను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, చిన్నారులకు హానికరమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. డిజిటల్ సంస్థలు కూడా పిల్లల రక్షణకు ప్రాధాన్యమిస్తూ సమర్థవంతమైన కంటెంట్ ఫిల్టరింగ్, భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాలి.

పిల్లలు దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, సమాజం నిర్మించుకునే విలువల ప్రతిరూపం కూడా. వారి బాల్యాన్ని హింస, అసభ్యత, అనైతిక వినోదం ప్రభావం నుంచి కాపాడటం కుటుంబాలకే కాకుండా మీడియా, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, సమాజం ఉమ్మడి బాధ్యత. వినోదానికి స్వేచ్ఛ అవసరమే. కానీ ఆ స్వేచ్ఛ పిల్లల అమాయకత్వాన్ని బలి తీసుకునే స్థాయికి చేరకూడదు. బాధ్యతాయుతమైన కంటెంట్ సృష్టి, కఠినమైన నియంత్రణ, విలువల ఆధారిత డిజిటల్ సంస్కృతిని పెంపొందించడం ద్వారానే భావితరాలకు సురక్షితమైన బాల్యాన్ని అందించగలం.

# ఇంధన భద్రతకు... హరిత శక్తే శ్రీరామరక్ష

హెచ్. ప్రతాప్



దేశ ఆర్థికాభివృద్ధికి ఇంధనం జీవనాడి. పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా, సమాచార సాంకేతిక రంగాలు నిరంతరాయంగా ముందుకు సాగాలంటే స్థిరమైన ఇంధన సరఫరా అత్యవసరం. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న నేపథ్యంలో ఇంధన అవసరాలు కూడా అపూర్వంగా పెరుగుతున్నాయి. అయితే బొగ్గు, చమురు, సహజవాయువు వంటి శిలాజ ఇంధనాలపై అధికంగా ఆధారపడటం దేశ ఇంధన భద్రతకు పెను సవాలుగా మారింది. అంతర్జాతీయ యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రతి సారి భారత ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. అందుకే అసంప్రదాయ శక్తి వనరుల విస్తరణ నేటి అత్యవసర జాతీయ కర్తవ్యంగా మారింది.

భారత ఇంధన గణాంకాలు పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. 2023--24లో దేశ ప్రాథమిక ఇంధన సరఫరాలో 60 శాతం బొగ్గు, 28 శాతం చమురు, 7 శాతం సహజవాయువు నుంచే లభించింది. అణుశక్తి, జలవిద్యుత్, ఇతర పునరుత్పాదక వనరుల వాటా కలిపి కేవలం 5 శాతం మాత్రమే. అంతేకాదు, భారత్ తన ముడి చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. దీంతో ప్రతి సంవత్సరం లక్షల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఖర్చవుతోంది. ఇంధన దిగుమతులపై ఈ అధిక ఆధారపడటం దేశ ఆర్థిక స్థిరత్వానికే కాదు, వ్యూహాత్మక భద్రతకూ ప్రమాదకరం.

ఈ నేపథ్యంలో సౌరశక్తి, పవనశక్తి, జలవిద్యుత్, బయోమాస్, హరిత హైడ్రోజన్ వంటి అసంప్రదాయ శక్తి వనరుల అభివృద్ధి ఆశాజనకంగా సాగుతోంది. 2025 నాటికి దేశ మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 5,13,730 మెగావాట్లకు చేరుకోగా, అందులో 2,66,788 మెగావాట్లు (51.93 శాతం) శిలాజేతర వనరుల నుంచే లభిస్తున్నాయి. సౌరశక్తి సామర్థ్యం దాదాపు 98 గిగావాట్లు, పవనశక్తి 48 గిగావాట్లకు పైగా చేరడం విశేషం. ఇది ప్రపంచ పునరుత్పాదక శక్తి రంగంలో భారతదేశం వేగంగా ముందుకు సాగుతున్నదానికి నిదర్శనం.

అసంప్రదాయ శక్తి వనరుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. విదేశీ ఇంధన దిగుమతులు తగ్గి విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. కార్బన్ ఉద్గారాలు తగ్గి వాతావరణ మార్పులను నియంత్రించవచ్చు. సౌర, పవన విద్యుత్ స్థానికంగానే ఉత్పత్తి చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు కూడా నాణ్యమైన విద్యుత్ అందుతుంది. పునరుత్పాదక ఇంధన రంగంలో లక్షలాది కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయి. ఒకసారి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా గణనీయంగా తగ్గుతుంది. ఇదే “హరిత ఆర్థిక వ్యవస్థ”కు బలమైన పునాది.

భారత్ 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని, 2070 నాటికి నికర సున్నా కార్బన్ ఉద్గారాల (నెట్ జీరో) లక్ష్యాన్ని చేరుకోవాలని సంకల్పించింది. ఈ లక్ష్యాలు విజయవంతం కావాలంటే ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం, పరిశోధనా సంస్థలు, ప్రజలు కలిసి ముందుకు రావాలి. రూఫ్‌టాప్ సౌర విద్యుత్, విద్యుత్ వాహనాలు, హరిత హైడ్రోజన్, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, దేశీయ తయారీకి మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం, విద్యుత్ పొదుపును అలవాటు చేసుకోవడం కూడా జాతీయ సేవే.

డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఒకసారి “ఇంధన స్వావలంబన లేకుండా సంపూర్ణ ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యం కాదు” అని పేర్కొన్నారు. ఆ మాటలు నేడు మరింత ప్రాసంగికంగా మారాయి. ఇంధన భద్రతే జాతీయ భద్రతకు పునాది. శిలాజ ఇంధనాలపై ఆధారపడే దేశం ఎప్పటికీ బలమైన ఆర్థిక శక్తిగా నిలవలేదు. అసంప్రదాయ శక్తి వనరుల్లో పెట్టుబడి పెట్టడం అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి కాదు... భారత భవిష్యత్తును, పర్యావరణాన్ని, ఆర్థిక స్వావలంబనను సురక్షితం చేయడం. ఇదే “వికసిత భారత్--2047” లక్ష్య సాధనకు అత్యంత శక్తివంతమైన మార్గం.




# అనకాపల్లి జిల్లా సమావేశం

అనకాపల్లి జయ జయహే

అనకాపల్లి జిల్లా నుంచి అనకాపల్లి అర్చక సమైక్య ప్రతినిధి భోగ లింగేశ్వర శర్మ యలమంచిలి సుదర్శన నారాయణ చార్యులు వెలవలపల్లి మృత్యుంజయ శర్మ పాణింగ పల్లి నరసింహాచార్యులు పుల ఖండం గోపాలచార్యులు వెలవలపల్లి కామేశ్వర శర్మ సకల ఆగమ అర్చకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీరంతా కలిసి అర్చకుల సమస్యలపై స్థానిక ఎలమంచిలి గుర్రప్ప కళ్యాణమండపంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది పలు దేవాలయంలో పనిచేస్తున్న అర్చకులు వారు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వాలు అర్చకులు కోసం విడుదల చేసిన జీవోలు అమలు చేయడంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది అమలు చేయడంలో చూపిస్తున్న నిర్లక్ష్యం తో పలు దేవాలయాల్లో అర్చకులు పడుతున్న ఇబ్బందుల గురించి ఈ సమావేశంలో చర్చించడం జరిగింది సిక్స్ సి టెంపుల్ లో పనిచేస్తున్న అర్చకులకు గత ప్రభుత్వం ఇప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం 5000 రూపాయలు జీతం తీసుకున్న అర్చకులకు పదివేల రూపాయలు 10000 రూపాయలు తీసుకుంటున్నా అర్చకులు 15000 రూపాయలు ఇవ్వమని ప్రభుత్వం ఆదేశించిన కొన్ని దేవాలయాలో అమలయితే మరి కొన్ని దేవాలయాలు అమలు కావడం లేదు వీరికి చాలా జీతాలతో వెళ్ళ బుచ్చడం జరుగుతున్నది అలాగే డిడిఎన్ఎస్ పెట్టుకుని అర్చకులు ఇప్పటివరకు వారికి జీతాల ఇవ్వకపోవడం పెట్టిన అప్లికేషన్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అమరావతి హెడ్ ఆఫీస్ లో క్లియరెన్స్ కాకుండా ఉండిపోవడం జరిగింది. కింద దేవాదాయ శాఖ అధికారులు నడిచే మేము చేసేది ఏమీ లేదంటూ వారు సమాధానం చెప్పడం జరుగుతున్నది. దేవాలయాల్లో ఎన్నో తరాల నుంచి పనిచేస్తున్న అర్చకులు వంశపారపర్యం హక్కు కల్పించమని దేవాలయంలో పనిచేసే అర్చకులకు గుర్తింపు కార్డులు ఇవ్వమని రైతు భరోసా దేవాలయ భూమై సర్వీస్ చేస్తున్న అర్చకులకు రైతు భరోసా కల్పించాలని రాష్ట్రంలో ఉన్న అర్చకులు అంతా ఒక భారీ సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వానికి మన సమస్యలు తెలియ చేయాలని అర్చకులు ఈ సమావేశంలో కోరడం జరిగింది ఇలా పలు సమస్యలపై అర్చకులు మాట్లాడడం జరిగింది ఈ సమావేశానికి అనకాపల్లి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అర్చకులు హాజరు కావడం జరిగింది

# జైల్ భరో జయప్రదం చేయండి

## రైతు, కార్మిక సంఘాలకు పిలుపు

**అనకాపల్లి జయ జయహే**

రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాని జయప్రదం చేయాలని బుధవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘాలు సమావేశంలో పిలుపునివ్వడం జరిగింది ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దొరబాబు మాట్లాడుతూ ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాధానికి వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉ ద్యమం నేడు ఆ బ్రిటిష్ కంటే దుర్మార్గమైన విధానాలతో కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలను దోచుకుని తింటున్నదని రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా కార్మికులకు కనీస వేతనాలు లేకుండా కార్పొరేట్ విధానాలకు వారికి అడుగులు మడుగులు ఒత్తుతూ ఎర్ర తివాచపరిచి ప్రజలను దోచుకునే విధంగా తయారవుతున్నారని వారి పేర్కొన్నారు మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన ఉద్యమంతో ఆనాడు నల్ల చట్టాలను వెనక్కు తీసుకున్న మోడీ ప్రభుత్వం వాటిని దొడ్డిదారిన అమలు చేస్తూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తులకు అవకాశం కల్పిస్తున్నదని రైతులకు పంటలకు సోమనాథ్ కమిషనర్ సిఫార్సులు అనుగుణంగా గిట్టుబాటు ధరను కల్పించకుండా రైతులను ఆత్మహత్యలకు పురు గొలుపుతున్నదని వారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో 23 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్



కోర్టులను తెచ్చి కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెట్టిందని పని గంటలు పెంపు కనీస వేతనాలు అమలు కాకుండా ఉ ద్యోగ భద్రత లేకుండా చేస్తున్నదని వారి పేర్కొన్నారు ఈ విధానాలు కు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంతపడుతూ రాష్ట్రంలో రైతులను కార్మికులను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నదని ఈ విధానాలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా ఆగస్టు 10న అనకాపల్లి జిల్లాలో మూడు రెవెన్యూ కేంద్రాల్లో జైల్ భరో కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఈ జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు కార్మికులు రైతాంగం విద్యార్థులు యువత మహిళలు పెద్ద ఎత్తునపాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రీ అప్పారావు రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు కోరుమిల్లి శంకర్రావు కౌలు రైతు సంఘం కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ ఏఐటియుసి నాయకురాలు రాజు తదితరులు పాల్గొన్నారు



## జనవాణిలో సమస్యల వెల్లువ

### సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సుందరపు హామీ

**అచ్యుతాపురం, ఆగస్టు 5, జయ జయహే:**

అచ్చుతాపురం, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల నుండి సమస్యలను పరిష్కరించేందుకు ఎలమంచిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మునగపాక మండలం పాటిపల్లి గ్రామ జనసేన నాయకులు డి.రామచంద్రరావు, మొల్లేటి వెంకట భోగేశ్వర రావు ఆధ్వర్యంలో పాటిపల్లిలో సమస్యలు పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. పాటిపల్లి నరసింహ స్వామి ఆలయం ఇటీవల శిథిలావస్థకు చేరుతుందని, ఆలయ నిర్మాణం చేపట్టి కొండపైకి వెళ్లేందుకు రోడ్డు కల్పించాలని, గతంలో మాదిరిగా విశాఖపట్నం నుండి బస్సును పునరుద్ధరించి అచ్యుతాపురం వరకు కొనసాగించాలని, పాటిపల్లి బీసీ కాలనీలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ను జనవాని కార్యక్రమంలో కోరారు. ఈ కార్యక్రమంలో పి జె ఎస్ ఎన్ మూర్తి, లక్ష్మణరావు, అప్పలనాయుడు, జనసేన కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం మునగపాకలో స్వచ్ఛ మునగపాక కార్యక్రమం నిర్వహించడం, సమస్యల పరిష్కారం కోసం పాటిపల్లి జనసేన యువకులు కదిలి రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా వెంటనే చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హామీ ఇచ్చారు.

### పంచదారల కొండ అక్రమ మైనింగ్‌లో

## అసలు సూత్రధారులపై చర్యలు తీసుకోవాలి

### ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తనకాల అనంతరావు

**అచ్యుతాపురం, ఆగస్టు 5, జయ జయహే:**

అచ్యుతాపురంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తనకాల అనంతరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసులు మాట్లాడుతూ మైనింగ్ మాఫియా, ఎస్ ఈ జెడ్ నిర్వాసితుల సమస్యలు, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇతర సమస్యల పైన చర్చించేందుకు గురువారం మార్టూరు రోడ్లో గల హ్యాపీ ఫంక్షన్ హాల్ లో ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి నియోజకవర్గంలోని నాయకులు, ముఖ్య కార్యకర్తలు, గ్రామ శాఖ అధ్యక్షులు తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు. అచ్యుతాపురంలో జరిగిన సమావేశంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంవిఆర్ రాహుల్, ఎలమంచిలి కాంగ్రెస్ నాయకులు నాగు మంత్రి సాయి, కడియాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.





### వైఎస్ఆర్సీపీ అనకాపల్లి జిల్లా రజక విభాగం

## అధ్యక్షునిగా వాడపర్తి

**మునగపాక, ఆగస్టు 5, జయ జయహే**

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో బయటపడ్డ వైసిపి విభేదాలు, మాజీ శాసనసభ్యులు కన్నబాబు రాజు వర్గానికి చెందిన బోడకుర్తి గణేష్ ను తప్పించి పాయకరావుపేట నియోజకవర్గం చెందిన వాడపర్తి కుసరాజును అనకాపల్లి జిల్లా రజక విభాగం అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా కుసరాజును అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పార్టీ కార్యాలయంలో సన్మానించారు. అనకాపల్లి జిల్లా రజక విభాగం అధ్యక్షుడు కుసరాజును సన్మానించి, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో వైసిపి అనకాపల్లి జిల్లా రజక విభాగం అధ్యక్షుడిగా ఉన్న బోడకుర్తి గణేష్ జయ జయహే తో మాట్లాడుతూ నేను అన్న, రజక కులం అన్న మా పార్టీ అధ్యక్షుడుకు చిన్న చూపు అని, అందుకే తనను వ్యక్తిగత కక్షతో తొలగించారని, అయినప్పటికీ మా రజక కులానికి చెందిన వ్యక్తికి ఇచ్చారు కదా అని గణేష్ అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా తాను పార్టీకి విధేయుడును అని జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమంలో పాల్గొంటానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో చురుకుగా పని చేసే మునగపాక ఎంపీటీసీగా పనిచేసిన బోడకుర్తి గణేష్ కు పార్టీ పదవి నుండి తొలగించడం పట్ల పార్టీలో చర్చనీయ అంశమైంది. మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు వర్గానికి గణేష్ అనుకూలంగా ఉండడం వల్ల తొలగించారని ప్రచారం జరుగుతుంది.




### స్వచ్ఛ మునగపాక

## కార్యక్రమానికి శ్రీకారం

**మునగపాక, ఆగస్టు 5,( జయ జయహే )**

గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో స్వచ్ఛ మునగపాక తయారు చేయడం కోసం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సూచన మేరకు జిల్లా అధికారులను సమన్వయం చేసుకొని, కోహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ నిధులతో, యువకుల శ్రమదానంతో స్వచ్ఛ మునగపాక తయారీ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గ్రామంలో గల షాపులు యజమానులతో మాట్లాడి, గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు సహకరించాలని సూచించి, అందరికీ డస్ట్ బిన్లను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక గ్రామీణ యువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మల్ల జోగారావు, ఆడారి పూర్ణచంద్రరావు, బొడ్డేడ అప్పలనాయుడు, టెక్కలి పరశురాం, ఎల్లపు సంతోష్, అల్లవరపు రమణబాబు, మునగపాక గ్రామంలో గల యూత్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు శ్రమదానంలో పాల్గొని గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక యువతతో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, మండల తహసిల్దార్ సంధ్య, ఎంపీడీవో ఉషారాణి, మునగపాక సచివాలయ సిబ్బంది, మండల సిబ్బంది, గ్రామస్తులు, పెద్ద ఎత్తున ఈ పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని, తమ వంతు బాధ్యతగా శ్రమదానం చేపట్టారు. మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన స్థానిక గ్రామీణ యువజన మందిరం కమిటీ సభ్యులను అధ్యక్షుడు శ్రీకాంత్ ను పలువురు అభినందించారు.




## కుష్టువ్యాధి బాధితులకు నిత్యావసర, పోషకాహార సరుకుల పంపిణీ

### చేయూతనందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం

### అప్‌హోల్డ్ సంస్థ ఛైర్మన్ ఫిలిప్ తిమోతి

**శ్రీకాకుళం. (జయ జయహే)**

స్థానిక అప్‌హోల్డ్ నగర్‌లో నివాసముంటున్న కుష్టురోగ బాధిత కుటుంబాలకు 'అప్‌హోల్డ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోషకాహార నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా 20 కుష్టురోగ బాధిత కుటుంబాలకు ఆహార, పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అప్‌హోల్డ్ సంస్థ ఛైర్మన్ ఫిలిప్ తిమోతి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ఆదరణకు, ప్రత్యేక శ్రద్ధకు నోచుకోవాల్సిన కుష్టురోగ బాధిత కుటుంబాలకు చేయూతనందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బాధితులకు నాణ్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య స్థితిని మెరుగుపరచవచ్చని, భవిష్యత్తులో కూడా ఇటువంటి అనేక సేవా కార్యక్రమాలను సంస్థ తరఫున కొనసాగిస్తామని తెలిపారు. అప్‌హోల్డ్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సుప్రజాదేవి.రౌత్, కోశాధికారి సోమేశ్వర రావు, సంస్థ సిబ్బంది, సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్, బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

### కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయంలో

# ఘనంగా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు







**విజయనగరం, ఆగస్టు 5: (జయ జయహే)**

కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ విజయనగరంలో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య తంత్రవాహి శ్రీనివాసన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా 'పద్మశ్రీ' చింతలపాటి వెంకటపతి రాజు (ఏటికొప్పాక బొమ్మల కళాకారుడు) పాల్గొన్నారు. ఆయన ఏటికొప్పాక బొమ్మల విశిష్టత, గిరిజన మరియు స్థానిక కళల పరిరక్షణ, సంప్రదాయ హస్తకళల ద్వారా జీవనోపాధి అవకాశాలు, యువతలో స్వయం ఉపాధి ప్రోత్సాహం వంటి అంశాలపై మాట్లాడుతూ ప్రధాన మంత్రి మన కి బాత్ లో ఈ బొమ్మల గురించి చర్చించిన అంశం గుర్తు చేశారు. భారతీయ సాంప్రదాయ కళలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపు నిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ. కృష్ణదేవ రావు గిరిజనుల రాజ్యాంగ హక్కులు, విద్య యొక్క ప్రాముఖ్యత, సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం సాధనలో ఉన్నత విద్య పాత్ర, గురజాడ అప్పారావు వంటి గొప్ప మహానుభావులు నడయాడిన ప్రదేశం విజయనగర మనీ అలాంటి ప్రదేశం లో గిరిజనుల అభివృద్ధికి విశ్వవిద్యాలయం స్థాపించడం ఎంతో ముదావహం అన్నారు. గిరిజన యువత విద్య ద్వారా సాధికారతను సాధించి దేశ ఖ్యాతిని దశ దిశలా వ్యాపింపజేయాలని అన్నారు. అధ్యక్ష ప్రసంగంలో ఉపకులపతి ఆచార్య తంత్రవాహి శ్రీనివాసన్ విశ్వవిద్యాలయం స్థాపన నుంచి సాధించిన ప్రగతిని వివరించారు. జాతీయ విద్యా విధానం--2020 అమలుతో పాటు గిరిజన విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, స్థానిక జ్ఞాన వ్యవస్థల పరిరక్షణకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని తెలిపారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఫైనాన్స్ అధికారి ముక్కామల శరత్చంద్ర బాబు, గ్రంథపాలకులు డా. శంకర్ రెడ్డి కొల్లె మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు మరియు సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పారదర్శక పరిపాలన, విద్యా నాణ్యత, విద్యార్థి మద్దతు వ్యవస్థలు మరియు సౌకర్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి డా. అనిరుధ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమ నిర్వహణలో కమిటీ సభ్యులు డా. దివ్య, డా. ప్రామా ఛటర్జీ, డా. ఇప్పిలి తారకేశ్వరరావు, డా. ఎన్ వి ఎస్ సూర్య నారాయణ, మనీష్ కుమార్, సత్యరావు విశ్వవిద్యాలయ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీయూడబ్ల్యూజే అల్లూరి జిల్లా
# నూతన కార్యవర్గ తొలి సమావేశం





**పాడేరు, జయ జయహే :**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( ఏపీయూడబ్ల్యూజే) అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కార్యవర్గ తొలి సమావేశం బుధవారం పాడేరులోని స్థానిక కాఫీ హౌస్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. నూతన కార్యవర్గం ఏర్పాటైన తర్వాత జిల్లా కేంద్రంలో నిర్వహించిన మొదటి సమావేశం కావడంతో యూనియన్ ప్రతినిధులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జర్నలిస్టుల పాత్ర మరువలేనిది: వంపూరి గంగులయ్య**

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జానపద కళల సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య మాట్లాడుతూ, తాను ప్రజా పోరాటాలు చేసిన రోజుల నుంచి పాత్రికేయులు, మీడియా ప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తర్వాత పాడేరులో జరిగిన తొలి కార్యవర్గ సమావేశానికి రావడం ఆనందంగా ఉందన్నారు.

మైదాన ప్రాంతాలతో పోలిస్తే మన్యం ప్రాంతాల్లో పనిచేసే జర్నలిస్టుల పరిస్థితులు, సవాళ్లు చాలా భిన్నంగా ఉంటాయని ఆయన గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న విలేకరుల సమ-స్యల పరిష్కారానికి తన వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు.

**అపోహలు నమ్మవద్దు.. ఐక్యంగా ముందుకు సాగాలి : స్వామి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి**

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి బి.ఎల్. స్వామి మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు భద్రత కోసం యూనియన్ నిరంతరం పోరాడుతోందన్నారు. అల్లూరి జిల్లాలోని పాత్రికేయులందరూ ఐక్యంగా పనిచేసి యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్‌లో విభేదాలు సృష్టించేందుకు కొందరు వ్యాప్తి చేసే అపోహలను, అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు, యూనియన్ నాయకులు మరియు పలువురు విలేకరులు పాల్గొన్నారు.



# మహిళా మార్టుపై కేసు నమోదు

**మాడుగుల, ఆగస్టు 5 జయ జయహే**

మాడుగుల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి నిర్వహించిన మహిళ మార్ట్ ప్రస్తుతం నష్టాలు బారినబడి మూతబడింది. దీనిపై తీవ్ర ఆందోళన కూడా రేగిన నేపథ్యంలో మాడుగుల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఈ వివరాలను ఎస్ఐ నారాయణరావు బుధవారం రాత్రి విలేకరులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆరుగురు వ్యక్తులపై ఫిర్యాదు అందినట్టు తెలిపారు. వివరాలను ఎస్ఐ తెలియజేశారు. మాడుగుల మండల కేంద్రంలో డ్వాక్రా మహిళల సహకారంతో 2022 ఆగస్టు ఒకటో తేదీన మాడుగుల పంచాయతీ ఆడిటోడియంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. ఒకకు మహిళ నుంచి 200 రూపాయలు చొప్పున వసూలు చేసి మొత్తం 31 లక్షల 67 వేల 467 రూపాయలు పెట్టుబడితో ఈ మార్ట్ ప్రారంభించారు. మొత్తం 11 మంది నిర్వహణలో ఈ మార్ట్ కొనసాగింది. అయితే మార్ట్ నిర్వహణలో నష్టాలు చవిచూసి మూతపడిన నేపథ్యంలో ఆ మార్ట్ కి సంబంధించి మార్ట్ ప్రెసిడెంట్, సెక్రటరీ, మేనేజర్, సిసి, ఆపరేటర్ల పై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ మార్ట్ లో మొత్తం 16 లక్షల 62 వేల నాలుగు 467 రూపాయలు దుర్వినియోగం జరిగినట్టు ఏపిఎం జి రమణి కుమారి ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



# అగనంపూడిలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు


**అగనంపూడి, ఆగస్టు 5, జయ జయహే :**

అగనంపూడి సి డబ్ల్యూ సి లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అగనంపూడి సెక్టర్ పరిధిలో ఉన్న 26 అంగన్వాడిల కేంద్రాలు సమైక్యంగా ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ ఎ. చెల్లయమ్మ మాట్లాడుతూ ప్రపంచంలో పిల్లల పుట్టిన వెంటనే వారిని సంరక్షించడానికి కేంద్ర రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేకమైన పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు ఒకటో తారీకు నుండి ఏడవ తారీకు వరకు ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు అంగన్వాడి సెంటర్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏడిసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి తల్లి డెలివరీ అయిన గంటలో తల్లి పాలు ఇవ్వాలని దీనివల్ల పిల్లలకి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, అమృతము లాంటి తల్లి పాలు ఇవ్వడంలో అశ్రద్ధ చేయరాదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంగన్వావాడి సెంటర్లకు పెద్దపీట వేస్తున్నారని నూతన అంగన్వడీలు కట్టిస్తున్నారని గతంలో ఇద్దరు పిల్లలే కాన్పు ఇవ్వాలని నిబంధన ఉండేదని ఇప్పుడు ముగ్గురు పిల్లలు కాన్పు ఇవ్వాలి వారికి ప్రభుత్వం నుండి ప్రోత్సహం ఇవ్వడం జరుగుతుందన్నారు. సుశేనా హెల్త్ ఫౌండేషన్ కన్సల్టెంట్ డా.ఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ ఎలాంటి ప్రయోజనాలను పొందుతారో వివరించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం, పసిపిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు.

# చంటి బిడ్డలతో రోడ్డున పడిన గిరిజన మహిళ
# అప్పు తీర్చలేదని ఇల్లు అమ్మేసిన మాజీ సర్పంచ్ భర్త!

**కేవీబీపురం, జయజయహే (ఆగస్టు 6):**

స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా, సాంకేతిక యుగంలోకి అడుగుపెట్టినా బడుగు, బలహీన వర్గాలపై పెత్తందార్ల అణచివేత ఆగడం లేదు. అప్పుగా ఇచ్చిన కొద్దిపాటి సొమ్ము కోసం ఒక గిరిజన మహిళకు చెందిన పక్కా ఇల్లినే ఆమెకు తెలియకుండా అమ్మేసి, చంటిపిల్లలతో సహా రోడ్డున పడేసిన మానవత్వ రహిత సంఘటన కేవీబీపురం మండలంలోని అంజూరు గిరిజన కాలనీలో శనివారం వెలుగుచూసింది. స్థానికులు, బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అంజూరు గిరిజన కాలనీకి చెందిన శీనయ్య, నందిని దంపతులు తమ ఇద్దరు చంటి పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. గతంలో స్థానిక వైకాపా తాజా మాజీ సర్పంచి శ్రీజయ భర్త సురేష్ వద్ద రూ.40 వేలు అప్పుగా తీసుకుని, తమ వద్ద ఉన్న మిగతా సొమ్మును జమ చేసి ఒక పక్కా గృహాన్ని నిర్మించుకున్నారు. అయితే ఇటీవల భర్త శీనయ్య మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన నందిని, పిల్లలతో కలిసి కొన్ని రోజులు కోడూరులోని కన్నవారింటికి వెళ్లింది. దీనిని ఆసరాగా



చేసుకున్న మాజీ సర్పంచ్ భర్త సురేష్, తాను ఇచ్చిన రూ.40 వేల అప్పు నెపంతో బాధితురాలికి ఎలాంటి సమాచారం లేకుండానే ఆ పక్కా గృహాన్ని రూ.2 లక్షలకు వేరొకరికి విక్రయించి, ఆ సొమ్మును తనే జమ చేసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత సొంతింటికి తిరిగివచ్చిన నందినికి తన ఇంటికి వేరే తాళం వేసి ఉండటంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. దీనిపై సురేష్‌ను నిలదీయగా ఆయన ఇచ్చిన సమాధానంతో అవాక్కయిన బాధితురాలు, న్యాయం చేయాలని కోరుతూ వెంటనే పోలీసులను ఆశ్రయించింది. అయితే ఫిర్యాదు చేసి రెండు రోజులు గడుస్తున్నా పోలీసులు తమ గోడు పట్టించుకోవడం లేదని బాధితురాలు కన్నీటిపర్యంతమవుతోంది. స్థానిక విజిలెన్స్, మార్టిన్ కమిటీలు సమావేశాలకే పరిమితమవుతున్నాయని, తమలాంటి నిరుపేదలకు క్షేత్రస్థాయిలో రక్షణ కరవైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, చంటిపిల్లలతో వీధిపాలైన గిరిజన బాధితురాలికి న్యాయం చేసి, ఆమె ఇల్లు ఆమెకు దక్కేలా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# తెలుగుదేశంతోనే అభివృద్ధి

**నెమళ్లూరు బుజ్జి.**

**శ్రీకాళహస్తి, ఆగస్టు 05,జయ జయహే.**

తెలుగుదేశం తోనే అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతాయని టీడీపీ యూనిట్ ఇంచార్జి నెమళ్లూరు బుజ్జి అన్నారు బుధవారం ఎన్టీఆర్ నగర్ లో యూనిట్ ఇంచార్జ్ నెమళ్లూరు బుజ్జి ఆధ్వర్యంలో యూనిట్ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమం లో బూత్ ఇన్చార్జిలు శివకుమార్, ఆకుల సునీత, చెందేటి బాలయ్య, భరత్ కుమార్, యూనిట్ పరిధిలో కార్యకర్తలు పసుపులేటి శంకరయ్య, జి రమేష్ బాబు, షేక్ సులేమాన్, శివ, హరి ప్రసాద్, టైలర్ వాసు, కృష్ణమాచారి, రత్నమ్మ, వంశీకృష్ణ, తేజ, శ్రీనివాసలు, గంగయ్య, కోటచారి, ఆదిఆచారి, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు పర్యటన

**గురుకుల పాఠశాలలో పరిశీలన.**

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి కొయ్యూరు లోని పలు గురుకుల పాఠశాలలను సందర్శించారు. ముందుగా జిటీడబ్ల్యూఎస్ నడింపాలెం,మరియు జిటీడబ్ల్యూఎస్ బాలికల పాఠశాల పి.మాకవరం పాఠశాలలను సందర్శించి స్టాక్ రూమ్, మెనూ, రికార్డులు, పరిశుభ్రత ను క్షుణ్ణంగా పరిశీలించారు.పి.మాకవరం పాఠశాలలో రాగిజావ రుచి చూశారు.అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన దింసా నృత్యం ను వీక్షించారు. కార్యక్రమం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థినులతో కలిసి ఆమె కూడా దింసా లో పాల్గొన్నారు. అనంతరం కే.డి.పేటలోని అల్లూరి సీతారామరాజు పార్క్ ను సందర్శించారు. పాఠశాలల్లో అందిస్తున్న భోజనం, వసతి, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.



# మహిళలపై నేరాలు, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం

**పోకలపాలెం, పోతవరం గ్రామాల్లో మంప ఎస్ఐ శ్రీనివాస్ పర్యటన**

**కొయ్యురు :(జయ జయహే )న్యూస్ ఆగష్టు 06,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం పోకలపాలెం, పోతవరం లో మహిళలు, యువతలో అవగాహన పెంచేందుకు మంప ఎస్.ఐ శ్రీనివాస్ ఈ రోజు పోకలపాలెం మరియు పోతవరం గ్రామాలను సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దాడులు, వేధింపులు జరిగితే వెంటనే 100, 181, 112 కు ఫోన్ చేయాలి అని, ఆన్లైన్ మోసాలు, ఓటీపీ లింకులు, లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తత హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపరాదు, వేగంగా నడపరాదు గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాల వలన కలిగే నష్టాలు వివరించారు.మంప ఎస్.ఐ శ్రీనివాస్ చట్టాల పట్ల అవగాహన కల్పించి, ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.




# ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు

**బుచ్చయ్యపేట జయ జయహే**

బుచ్చయ్యపేట మండలం తురకలపూడి సెక్టార్ పరిధిలో రాజాం,నీలకంఠపురం, సీతయ్యపేట, పి.పి అగ్రహారం పలు అంగనవాడి కేంద్రాల్లో ఈ తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రావికమతం సిడిపిఓ మంగతాయారు ఆదేశాల మేరకు అంగన్వాడి సిబ్బంది మరియు సూపర్వైజర్ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సూపెరవైజర్ హైమావతి మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యత,తల్లిపాలు ఇవ్వడం వల్ల వచ్చే ప్రయోజనాలు.తల్లి పాలు తాగడం ద్వారా పిల్లలు పిల్లలకు ఐక్యూ శక్తి పెరుగుతుందని,మహిళలు వచ్చే విధంగా రకరకాల క్యాన్సర్లు నివారించవచ్చని తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యం ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హేమావతిపి. పి. పి అగ్రహారం అంగన్వాడీ టీచర్ పి. ఈశ్వరమ్మ, సీతయ్యపేట అంగన్వాడీ టీచర్ ఎన్ దేవి గ్రామంలో సిబ్బంది, గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాన్ని బాధించడం...వేధించడమే కూటమి పని...!



### హామీలు నెరవేర్చలేక నానా పాట్లు పడుతున్నారు

### అన్యాయాన్ని నిలదీసినా..ప్రశ్నించినా వేధింపులే

### వైసీపీ ఎసఈసీ సభ్యులు డాక్టర్ జహీర్ అహ్మద్

**విశాఖపట్నం, ఆగష్టు 5, జయ జయహే :**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక అడిగే వారందరిపై మరీ ముఖ్యంగా ప్రతిపక్షం నాయకులందరినీ కూడా బాధించటం...వేధించటం... అరెస్టులు చేయించడమే కూటమి పనిగా ఉందని వైఎసఆర్‌సీపీ ఎసఈసీ సభ్యులు డాక్టర్ జహీర్ అహ్మద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నేతలతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో వైయస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా చాలాకాలంగా పొగాకు వ్యాపారం చేస్తున్నారని అయితే ఆ వ్యాపార లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాన్ని కొందరు వక్రీకరించి 'కిడ్నాప' గా ప్రచారం చేశారన్నారు. అనంతరం ముస్తఫా, ఆయన కుమారుడు, కుటుంబ సభ్యులు, అనుచరులపైనే కుట్రపూరితంగా కేసులు నమోదు చేశారని, డబ్బులు తీసుకుని పొగాకు సరఫరా చేయకుండా మోసం చేస్తున్నారని భావించిన వ్యక్తులను పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లి అప్పగించిందే ముస్తఫా కుటుంబమయితే అదేమీ పట్టించుకోకుండా వాళ్లపైనే కేసులు పెట్టడం సిగ్గు చేటన్నారు. మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి నిజంగా కిడ్నాప్ చేయాలనే ఉద్దేశం ఉంటే సంబంధిత వ్యక్తులను పోలీసులకు ఎందుకు అప్పగిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాథమిక వాస్తవాన్ని దాచిపెట్టి కిడ్నాప్ కథనాలు ప్రచారం చేయడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని వెల్లడించారు. వైయస్సార్సీపీ నాయకులను ఏదో ఒక కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోందని, చిన్న వివాదాన్ని కూడా రాజకీయంగా వక్రీకరించి అక్రమ కేసులు బనాయిస్తోందనడానికి ఈ కేసే ఉదాహరణగా పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడు, అనుచరులపై తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని విశాఖ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం తీవ్రంగా ఖండిసస్తుందన్నారు. జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు బర్కత్ అలీ మాట్లాడుతూ... మైనార్టీ నాయకుడు ముస్తఫాపై నమోదు చేసిన కిడ్నాప్ కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపులో భాగమేనన్నారు. న్యాయం కోసం బాధితుడిగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ముస్తఫాపైనే కేసు నమోదు చేయడం రాష్ట్రంలో అమలవుతున్న "రెడ్ బుక్ రాజ్యాంగం"కు నిదర్శనమని విమర్శించారు. కాజా టోల్ ప్లాజా, కాకాని పోలీస్ స్టేషన్‌లలోని సీసీటీవీ ఫుటేజీలను ప్రభుత్వం బహిర్గతం చేస్తే అసలు వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని సవాల్ విసిరారు. సాధారణ పొగాకు వ్యాపార లావాదేవీలకు రాజకీయ రంగు పులిమి తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. జిల్లా షేక్ విభాగం అధ్యక్షులు ఎం.డి. షరీఫ్ మాట్లాడుతూ ఎలాంటి సమగ్ర విచారణ లేకుండానే ఒక మాజీ ప్రజాప్రతినిధి చేసిన ఆరోపణల ఆధారంగా చర్యలు తీసుకోవడం సరికాదని ఆయన అన్నారు. నిర్దోషులపై వేధింపులు ఆపాలని, బాధ్యులపై మాత్రమే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సమావేశంలో విశాఖపట్నం ఉత్తరం నియోజకవర్గం ఆర్ టి ఐ విభాగం అధ్యక్షులు ఎస్ కే బాబ్జి పాల్గొన్నారు



## రాష్ట్ర ఎస్సీ ఎస్టీ చైర్మన్ పర్యటన

### సిపిఎం పార్టీ నాయకుడు కామ్రేడ్ రమేష్

**అరకు జయ జయహే**

ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి అరకు వేలి మండలం మాదల గ్రామపంచాయతీ దోమలజోరు రక్తకండి గ్రామాలలో పర్యటనలో భాగంగా స్థానిక పంచాయతీ గిరిజన సంఘం కార్యదర్శి కామ్రేడ్ రమేష్ మాట్లాడుతు. పంచాయతీలో 21,గ్రాములలో రోడ్డు,విద్య,వైద్యం సమస్య వివరించి సమస్య వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ చైర్మన్ కు వివరించారు, స్పష్టంగా స్పష్టమైన హామీతో మీ సమస్య పరిష్కారం కోసమే మీ గ్రామం వరకు రావడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారు, ప్రతి సమస్య రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టి లో పెట్టి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమానికి దాబుగుడ పీసా కార్యదర్శి గురుమూర్తి ,సోన్ను ,రాము ,రామరావు, బుజ్జిబాబు ,గ్రామస్తులు పాల్గొన్నారు,



## మాజీ ఎమ్మెల్యే మళ్ల ఇంట్లో బీహార్ ఈడీ తనిఖీలు

**- రూ. 3 వేల కోట్లకు పైగా చిట్‌ఫండ్స్ కుంభకోణంలో సోదాలు**

**- విశాఖ పశ్చిమ వైసీపీ సమన్వయకర్తగా మళ్ల విజయప్రసాద్**

**- ఏక కాలంలో అయిదు చోట్ల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు**

**విశాఖపట్నం, ఆగష్టు 5, జయ జయహే :**

వైసీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మళ్ల విజయప్రసాద్ నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. ఈ విషయం దావానంలా వ్యాపించడంతో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. హైదరాబాద్, విశాఖపట్నంలలోని ఐదు విభిన్న ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఈడీ అధికారుల బృందం ఈ దాడుల్లో నేరుగా పాల్గొంది. వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీల చైర్మన్‌గా ఉన్న సమయంలో డిపాజిట్ల సేకరణ, నిధుల మళ్లింపులో తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల ఆధారంగా ఈ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 3 వేల కోట్ల మేర చిట్‌ఫండ్ అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సోదాల్లో భాగంగా బ్యాంక్ ఖాతాలు, ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ సాక్ష్యాలు, కీలక పత్రాలను ఈడీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మళ్ల విజయప్రసాద్ 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందగా, 2019 శాసనసభ ఎన్నికల్లో విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత 2021లో ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వేళ ఈడీ సోదాలు జరగడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీల ఛైర్మన్‌గా అవకతవకలకు పాల్పడిన కేసులో ఈడీ సోదాలు..విశాఖలోని సీతమ్మదార లో గల ఆయన నివాసంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఈ డి సోదాలు మొదలయ్యాయి. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల వెల్ఫేర్ కార్యాలయంలో కూడా ఈ బృందాలు విచారణలు చేపట్టాయి. ప్రస్తుతం హైదరాబాదులో తన కుటుంబీకులతో ఉంటున్న మళ్ల విజయ ప్రసాద్ ను ఈ డి విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

# నానో మెటీరియల్స్ ఈ నాటివి కావు

### హైదరాబాద్ యూనివర్శిటీ ప్రొఫెసర్ టి. పి. రాధాకృష్ణన్

### ఘనంగా నానోమెటీరియల్స్ అండ్ ది కెమిస్ట్రీ కనెక్షన్‌పై సదస్సు

**విశాఖపట్నం, ఆగస్టు 5,, జయ జయహే**




ప్రాచీన కాలం నుంచే ప్రపంచ వ్యాప్తంగా నానో మెటీరియల్స్‌కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ఉందని ప్రముఖ శాస్త్రవేత్త, హైదరాబాద్ విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం ఎమెరిటస్ ప్రొఫెసర్ టి. పి. రాధాకృష్ణన్ అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో బుధవారం జరిగిన సదస్సులో నానో మెటీరియల్స్ అండ్ ది కెమిస్ట్రీ కనెక్షన్ అనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాధాకృష్ణన్ నానోటెక్నాలజీ చారిత్రక పరిణామాన్ని, నానోమెటీరియల్స్ తయారీ, లక్షణాలు మరియు వినియోగాలలో రసాయన శాస్త్రం ప్రాధాన్యతను వివరించారు. భారతదేశంతో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ఉన్న విషయాలను వివరించారు. సెమీ కండక్టర్లు, కాంపోజిట్స్, బయో మెటీరియల్స్, ఔషధ రంగం తదితరాలలో నానో మెటీరియల్స్ వినియోగాన్ని, వాటి ప్రత్యేక లక్షణాలను ఆయన వివరించారు. సెమ్ టెమ్ ఎఎఫఎం వంటి ఆధునిక పరికరాల ద్వారా నానోమెటీరియల్స్‌ను విశ్లేషించే విధానాలను కూడా వివరించారు. వెండి, బంగారు నానో కణాల వివిధ అనువర్తనాలను ప్రొఫెసర్ రాధాకృష్ణన్ ప్రదర్శించారు. అలాగే, తగ్గింపు చర్యల కోసం వెండిని ఉపయోగించే డిప్-మెథడ్ క్యాటలిసిస్ విధానాన్ని తన పరిశోధనా బృందం అభివృద్ధి చేసిన విషయాన్ని వెల్లడించారు. అనంతరం ప్రొఫెసర్ రాధాకృష్ణన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఎస్. కె. చక్రవర్తి, క్యాంపస్ కోఆర్డినేషన్ డీన్ కె. సోమేశ్వర రెడ్డి, కెమిస్ట్రీ ప్రొఫెసర్, కెమికల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ జి. వి. ఆర్. శర్మ ఘనంగా సత్కరించారు. సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్ ప్రొఫెసర్ రాధాకృష్ణన్ చేసిన విలువైన సేవలను అభినందిస్తూ, కళాశాలలో పరిశోధన మరియు విద్యా కార్యక్రమాల అభివృద్ధికి ఆయన సూచనలు కోరారు. సుబ్బలక్ష్మి స్వాగతం పలికి, అనంతరం వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## వరి నారు మడిలో కలుపు యాజమాన్యం చేపట్టాలి

**మాడుగుల ఆగస్టు 5 జయ జయహే**

ఏలినినో నేపథ్యంలో రైతులు వారి నారుమడిలో కలుపు యాజమాన్యం చేపట్టడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మాడుగుల మండలం అవురువాడ, పొంగలిపాక గ్రామాలలో శాస్త్రావెత్తల బృందం తో కలిసి ఏవో అనసూయ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఈకార్యక్రమం లో కొండంపూడికృషి విజ్ఞానకేంద్రం శాస్త్రావేత్త డా. కే రాజ్ కుమార్ రైతులకు సూచనలు చేస్తూ ఎలినినో ప్రభావం పై అవగాహన కల్పిస్తూ..వరి నారు మడిలో కలుపు యజమాన్యమును చేయడం వలన నారు ఆరోగ్యముగా ఉండడానికి సహాయపడితుందని తెలిపారు. అలాగేప్రస్తుతం ఉన్న వర్షా భావ పరిస్థితులలో రైతులు కంది, రాగి పంటలను వేసుకోవడం లాభదాయకమని ,నారు మడిలో జింక్ లోప సవరణను 2.5 గ్రాముల అన్నాభేది ని లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈకార్యక్రమం లో కింతలి పిఎసిఎస్ చైర్మన్ ఉండూరు. దేముడు, ఎన్ సత్యనారాయణ, 3.వ్యవసాయ శాస్త్రావెత్తలు ,గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ తొలి ఏడాది ఆన్లైన్ అడ్మిషన్లు ప్రారంభం

**మాడుగుల ఆగస్టు 5 జయ జయహే**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాడుగులలో ఆన్లైన్ కౌన్సిలింగ్ ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకుషెడ్యూల్ను ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి జయ బుధవారం తెలియజేశారు. ఎందుకు సంబంధించి విద్యార్థులు ఈనెలతేదీ 5 నుండి 11 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ తెలిపారు. అలాగేసర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తారన్నారు.వెబ్ ఆప్షన్స్ ఈనెల 15 నుండి 19వ తారీకు వరకు విద్యార్థులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 20న వెబ్ ఆప్షన్స్ మార్చుకోవచ్చన్నారు. 26న విద్యార్థులకు సీట్లు కేటాయింపు వివరాలు ప్రకటిస్తామన్నారు. కాగాఈనెల 27 నుండి 29 మధ్య విద్యార్థులు కళాశాలలో చేరవలసి ఉంటాదన్నారు. ఈనెల 27 నుండి కళాశాల లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం మాడుగుల కళాశాలలో బి ఎ హిస్టరీ, హానర్స్, పొలిటికల్ సైన్స్ హానర్స్, బీకాం కంప్యూటర్స్, బిఎస్సి మ్యాథ్స్ కంప్యూటర్స్, బిఎస్సి బాటనీ బీఎస్సీ జువాలజీ కోర్సులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కాబట్టి ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.



## ఒమ్మలిలో తల్లిపాల వారోత్సవాలు

**మాడుగుల ఆగస్టు 5 జయ జయ హే**

తల్లిపాల వారోత్సవాలులో భాగంగా మాడుగుల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల వొమ్మలి 2వ అంగన్వాడి కేంద్రం పరిధిలో సిడిపిఓ శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు అమృతం తో సమానం అని చెబుతూ, ప్రతి బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకా గా ముర్రిపాలు అందించవలెను. తల్లిపాలు కేవలం ఆరు నెలల వరకు కొనసాగించి,అలాగే ప్రతి బిడ్డకు 2 సంవత్సరాలు వరకు తల్లి పాలు కొనసాగించాలన్నారు. తల్లికి కలిగే ప్రయోజనాలు తల్లీ బిడ్డ అనుబంధం పెరుగుతుందని, తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ అండాశయ క్యాన్సర్ రాకుండా ఉంటుంది అలాగే తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కానుపుకి మధ్య కానుపుకి కాలవ్యవధి పెరుగుతుందని చెబుతూ బిడ్డకు కలిగే ప్రయోజనాలుబిడ్డ కు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది కొలెస్ట్రాల్ పదార్థం బిడ్డకు చేరుతుందన్నారు. జ్ఞాపకశక్తి, బరువు పెరుగుతారన్నారు. బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయ .అలాగే సమాజానికి కూడా మంచి పిల్లలను తయారు చేయొచ్చనీ, అలాగే ఆర్థికంగా కూడా తల్లులకు ఖర్చు తగ్గించవచ్చన్నారు. అలాగే గర్భవతులు బాలింతలు తల్లులు మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తింటే పిల్లలకు తల్లిపాల ద్వారా పోషక విలువలు ఉన్న ఆహారం తల్లిపాల ద్వారా చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, జి వి రమణమ్మ అంగన్వాడికార్యకర్తలు, గర్భవతులు ,బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# గ్రంథాలయ చైర్మన్ వినతిపై మంత్రి లోకేష్ సానుకూలం

**విశాఖపట్నం, ఆగస్టు 5, జయ జయహే**

విశాఖ నగరం దండు బజార్ లోగల జిల్లా గ్రంథాలయ సంస్థ సొంత స్థలంలో నూతన కేంద్ర గ్రంథాలయం నిర్మాణం చేపట్టేందుకు మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం విశాఖ కు విచ్చేసిన విద్యా,ఐటీ,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ని కలసి వినతి పత్రం అందజేసినట్టు పేర్కొన్నారు. విస్తరిస్తున్న మహానగర అవసరాలకు అనుగుణంగా నగరంలో మరొక నూతన సిటీ సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ చేసిన వినతి పై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని, అద్దె భవనంలో నడుస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సొంత పాత స్థలంలోనే నూతన భవనాన్ని నిర్మించి వెంటనే భూమిపూజ (శంకుస్థాపన) నిర్వహించాలని, నగరంలో మరొక సిటీ సెంట్రల్ లైబ్రరీ అవశ్యకతను చైర్మన్ నొక్కి



చెప్పారు. సిబ్బంది మంజూరైన 132 పోస్టుల్లో 87 ఖాళీలు ఉండటం, పాఠకులకు సేవా అంతరాయం కలగకుండా కనీసం 30 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశానని చెప్పారు. అలాగే పెండింగ్ సెస్ బకాయిలు గడిచిన 16 సంవత్సరాలుగా స్థానిక సంస్థల నుండి సెస్ నిధులు రాకపోవడంతో సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, జీవీఎంసీ నుండి రూ. 218.79 కోట్లు, గ్రామ పంచాయతీల నుండి రూ. 24.51 కోట్లు, మున్సిపాలిటీల నుండి రూ. 73.62 లక్షలు కలిపి మొత్తం రూ. 244.05 కోట్లకు పైగా సెస్ బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. వీటితో పాటు 2008-09 ఆర్థిక సంవత్సరం నుండి దాదాపు రూ. 30.02 కోట్ల ప్రభుత్వ వార్షిక గ్రాంట్లు కూడా బకాయి ఉన్నాయని వివరించడంతో మంత్రి నారా లోకేష్ మాటాడుతూ నగర గ్రంథాలయాల అభివృద్ధికి పూర్తి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి నారా లోకేష్ హామీ యిచ్చినట్టు తెలిపారు.



## డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026'

# గ్లోబల్ సమ్మిట్

**విస్తృత ఏర్పాట్లు చేయాలి**

**సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి**

**భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి**

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**జయ జయహే**

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

**పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**జయ జయహే**

భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.




# పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయండి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 05,జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన 11,639 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డివైఎఫ్ పట్టణ కన్వీనర్ కళత్తూరు రవి డిమాండ్ చేశారు. స్థానిక వంగవీటి సర్కిల్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్బంగా రవి మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో టిడిపి కూటమి ప్రభుత్వంచెలగాటమాడుతోందన్నారు. గతంలో 19,999 ఖాళీలు ఉన్నాయని అసెంబ్లీలో హోంశాఖమంత్రి అనిత ప్రకటించారని గుర్తుచేశారు. నేడు కేవలం 2,500 పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధపడడం సిగ్గుచేటన్నారు. కనీసం పది వేల పోస్టులతో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయాలనిడిమాండ్ చేశారు. లేకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మద్దతు తెలిపారు. గురవయ్య, కౌసిక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, ఆగస్టు 05,జయ జయహే**

శ్రీకాళహస్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన అనేక మంది ప్రజలు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. వినతులను పరిశీలించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ ఇతర స్థానిక సమస్యలపై వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.



# అన్నదానానికి రూ.50 వేల విరాళం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 05,జయ జయహే**

.శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అన్నదానానికి రూ.50 వేల విరాళం అందజేశారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి నెల్లూరు టౌన్‌కు చెందిన బాబు ఐస్‌క్రీం అధినేత మురళి రూ.50,000 విరాళం ను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధన మున్నా రాయల్ మురళి కి స్వామివారి దర్శనం అనంతరం ఆశీర్వచనం అందించి ప్రసాదాలుఅందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏపీఆర్ఓ రవి పాల్గొన్నారు.



# మహిళలు, బాలికల రక్షణకు అభయ కంప్లైంట్ బాక్సు ఏర్పాటు

**చోడవరం, ఆగస్టు 5 జయ జయహే**

మహిళలు, బాలికల భద్రతను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో చోడవరం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చోడవరం బాలిక ఉన్నత పాఠశాల లో అభయ కంప్లైంట్ బాక్సును బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం పోలీస్ స్టేషన్ సి.ఐ. పి. అప్పలరాజు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఐ. పి. అప్పలరాజు మాట్లాడుతూ, ప్రతి పాఠశాల కళాశాలలో అభయ కంప్లైంట్ బాక్సను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే వేధింపులు, ఇబ్బందులు లేదా ఇతర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను గోప్యంగా ఈ బాక్స్‌లో నమోదు చేయవచ్చని, వాటిని పోలీసులు పరిశీలించి తక్షణమే స్పందించి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారని వివరించారు. అలాగే మహిళలు,బాలికలు ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు లేదా నేరాలకు గురైనప్పటికీ భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 మరియు మహిళా హెల్ప్‌లైన్-181 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో భద్రతా అవగాహన పెంపొందించడంతో పాటు, సమస్యలను నిర్భయంగా తెలియజేసే వాతావరణం కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.



# పంచాయతీ స్థలాలు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వండి

**ఎండిఓ ఆదేశం**

**మాడుగుల ఆగస్టు 5 జయ జయహే**

మాడుగుల మండలం కె జే పురం గ్రామంలో పంచాయతీ స్థాలు రోడ్లు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని అలాంటి వారికి నోటీసులు జారీ చేయాలని ఎండిఓ అప్పారావు గ్రామ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆయన కొందరు రోడ్లు ఆక్రమించిన విషయాన్ని ఆయన గుర్తించి అటువంటి వారిపై చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులైన రోడ్లు, పంచాయతీ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు.



# మోదమ్మ జాతరకు ప్రత్యేక పారిశుధ్య పనులు

**మాడుగుల ఆగస్టు 5 జయ జయహే**

మాడుగుల మండలం కేజేపురం గ్రామంలో గ్రామ దేవత ఈ ప్రాంత ఇలవేల్పు శ్రీ మోదకొండమ్మ వారి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో ఆ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎండిఓ కే అప్పారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో పర్యటించి జరుగుతున్న పారిశుధ్య పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేస్తూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మంచినీరు సరఫరా, విద్యుత్ సరఫరా వంటి వాటిపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్రధాన రహదారులతోపాటు గ్రామంలో ఎక్కడ కూడా ఎటువంటి అపరశుధ్యం నెలకొనకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి అధికారి పి సతీష్, టిడిపి క్లస్టర్ ఇన్చార్జి పి విజయలక్ష్మి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com